క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

యాదమరి: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం చెన్నై ఎంఎన్ కంటి ఆసుపత్రి వైద్యులు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 85 మంది రోగులను పరీక్షించారు. వారిలో 22 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించి, నిర్వాహకులు వారిని చెన్నైకు తరలించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పెరియంబాడి నాగరాజు, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

కె.గొల్లపల్లె హైస్కూలు హెచ్ఎంగా లలిత



బాధ్యతలు స్వీకరిస్తున్న లలిత

యాదమరి: మండలంలోని కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాల హెచ్ఎంగా లలిత గురువారం బాధ్యతలు స్వీకరించారు. బంగారుపాళ్యం మండలం మంగళపల్లె ఉన్నత పాఠశాల నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రమేష్ బోడబండ్ల ఉన్నత పాఠశాల హెచ్ఎంగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం లలిత ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. గ్రామాలలో ఉన్న బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు కనకాచారి, నరసింహారెడ్డి, మదనమోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మహిళలు

గుడిపాల: మహిళలు చట్టాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ లీగల్ ఆఫీసర్ వెంకటేషన్ అన్నారు. గురువారం గొల్లమడుగు గ్రామంలో సింధియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు ఉన్న హక్కులు, చట్టాల గురించి వెంకటేషన్ తెలియజేశారు. గృహహింస, బాల్యవివాహాల నిరోధం, లైంగిక వేధింపుల నుంచి రక్షణ.. మొదలైన అంశాలపై మాట్లాడారు.

గడ్డివామి దగ్ధం

గంగవరం: మండలంలోని కల్లుపల్లెలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో పాడి రైతు శంకరప్పకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. ఇంటి ముందు నిల్వ చేసి ఉన్న గడ్డివామికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అతి కష్టంపై మంటలను అదుపులోకి తెచ్చారు. రూ. 20వేలు విలువ చేసే గడ్డివామి దగ్ధమైనట్టు బాధిత రైతు వాపోయాడు.

ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్స్ తనిఖీ

- మూడు క్లినిక్స్‌ను సీజ్ చేసిన ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్



పీఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డాక్టర్ సుదర్శన్

బంగారుపాళెం: ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్స్ నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుదర్శన్ హెచ్చరించారు. బంగారుపాళెంలోని ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మూడు క్లినిక్స్‌ను సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ, ఆర్ఎంపీ, పీఎంపీలు నిబంధనల ప్రకారం కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తే క్లినిక్ లైసెన్సులను రద్దు చేసి, క్రిమినల్ కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలలో మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్, ఫ్యామిలీ డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

పేద పిల్లల చదువులకు పెద్దపీట

కార్వేటినగరం: పేద పిల్లల చదువులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ లత అన్నారు. గురువారం జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో జగనన్న విద్యాకానుక రథాన్ని ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ, విద్యాభ్యాసంలో పేద, ధనిక తేడా లేకుండా ప్రతిఒక్కరూ ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసించే విధంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా 1నుంచి పదో తరగతి వరకు జగనన్న విద్యాకానుకలో భాగంగా టెక్స్టుబుక్స్, నోటు పుస్తకాలు, మూడు జతల యూనిఫాం, రెండు జతల బూట్లు, సాక్స్‌లు, స్కూల్ బ్యాగ్, బెల్ట్‌తో పాటు డిక్షనరీ అందించి, విద్యకు ప్రాధాన్యత కల్పించింది జగనన్న ప్రభుత్వమేనని అన్నారు. తల్లిదండ్రులు ప్రతిఒక్కరూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అందుకోవాలన్నారు. ఎంపీడీఓ మోహన్‌మురళి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం డైట్ మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాకానుక ప్రదర్శనను ఎంపీపీ పరిశీలించారు. అలాగే, జేవీకే సరఫరా వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బాబు



మొగిలివారిపల్లెలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గురువారం మండలంలోని మొగిలివారిపల్లె, దళితవాడ, బలిజపల్లె దళితవాడ, జయంతి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై స్పందించారు. సంబంధిత అధికారులు ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల ముంగిటకే ప్రభుత్వం సేవలు అందిస్తోందన్నారు. అలాగే పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పాటు పడుతున్న తమ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లోనూ మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, మొగిలివారిపల్లె, జయంతి సర్పంచులు శ్రీనివాసులు, వళ్లెమ్మ, ఎంపిటీసీ శ్యామల, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ దొరస్వామి, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మొగిలీశ్వర, జిల్లా పార్టీ కార్యదర్శి శరత్‌రెడ్డి, ప్రభునాయుడు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, యువత ఉపాధ్యక్షుడు మహేంద్ర, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీప్రసన్న కుమార్, ఎంపీడీఓ హరిప్రసాద్, తహసీల్దార్ బెన్నురాజ్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు పాలమాకులపల్లెలో..

శుక్రవారం మొగిలివారిపల్లె గ్రామ సచివాలయం పరిధిలో ఉదయం 7 గంటల నుంచి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు.

పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్

ఐరాల: మండలంలోని మట్టపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణ సమేత ధర్మరాజుల ఆలయ ప్రారంభోత్సవంలో గురువారం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి కాణిపాకం దేవస్థానం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వారికి ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

బొమ్మసముద్రంలో 'ఫ్యామిలీ డాక్టర్'



గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రష్మిత



తవణంపల్లె : నలిశెట్టిపల్లెలో..

గుడిపాల: మండలంలోని కుప్పిగానిపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. బొమ్మసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి రష్మిత, షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు, గర్భవతులకు చికిత్స చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఎం సరిత, సూపర్‌వైజర్ శ్రీలత, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఆశావర్కర్ శివగామి పాల్గొన్నారు.

నాగంవాండ్లపల్లెలో..

ఐరాల: మండలంలోని నాగంవాండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గురువారం డాక్టర్ అరవింద్ 104 వైద్య శిబిరంలో 80 మంది రోగులకు, గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నలిశెట్టిపల్లెలో..

తవణంపల్లె: వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ కోరారు. గురువారం మండలంలోని నలిశెట్టిపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహం బాధితులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కుట్టుమెషిన్లు, స్ప్రేయర్లు పంపిణీ



కుట్టుమెషిన్ అందజేస్తున్న జిల్లా అధ్యక్షురాలు సరిత

చిత్తూరు రూరల్: మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక సిద్ధుల పీఠం బంగారు అడిగళ్లారు జన్మదినం పురస్కరించుకుని చిత్తూరులో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ఓంశక్తి అమ్మవారి చిత్రపటాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఓం శక్తి భక్తుల సంఘ అధ్యక్షురాలు సరిత ఆధ్వర్యంలో 25మందికి భక్తులకు కుట్టుమెషిన్లు, 12మందికి పురుగుల మందు పిచికారీ మెషిన్లు, 13మందికి వంటసామగ్రి పంపిణీ చేశారు. పలువురు సంఘ సభ్యులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ముగం, గిరిజ, నాగేంద్ర, నాగయ్య, వినాయకం, రాజా, రమేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంగా పెంచులయ్య



కుప్పం: కుప్పం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పెంచులయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న స్వామి చిత్తూరు బదిలీ అయ్యారు. బాధ్యతలను స్వీకరించిన పెంచులయ్యను ఎన్ఎంయూ కార్మిక సంఘ నాయులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎన్ఎంయూ నాయకులు జయపాల్, మణి, ప్రసాద్ కుమార్, మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం

- సీఎం చిత్రపటానికి కాంట్రాక్ట్ ఉద్యోగుల పాలాభిషేకం
- 20 ఏళ్ల కల నెరవేరిందని హర్షం

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులకు చేసిన మేలును ఎప్పటికి మరచిపోలేనిదని కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు కొనియాడారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట గురువారం వారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. థ్యాంకూ సీఎం సార్ అంటూ హోరెత్తించారు. తరువాత పలువురు మాట్లాడుతూ పారా మెడికల్ ఉద్యోగులుగా తాము 20 ఏళ్లు గా పనిచేస్తున్నామన్నారు. అనేక కష్టాలను ఎదుర్కొంటూ..కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మాత్రమే ఇన్నాళ్లు తమ విధులను సమర్థవంతంగా చేస్తూ వచ్చామన్నారు. ఏ ప్రభుత్వం కూడా తమ కష్టాలను, సేవలను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఎన్నికల హామీల మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు పూనుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్ని ఆర్థిక కష్టాలను ఉన్నా.. వాటిని లెక్కచేయకుండా కాంట్రాక్ట్ ఉద్యోగులకు కొండంత భరోసానిచ్చారని అన్నారు. ఇకపై తమ బతుకులు మారనున్నాయని.. జీవితాంతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భానుప్రకాష్, శరత్‌కుమార్, చంద్రశేఖర్, సుబ్రమణ్యంరెడ్డి, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో తిరుమంజన సేవ


- ఆన్‌లైన్‌లో స్వామివారి సేవల టికెట్లు
- ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు



కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ప్రతి బుధవారం తిరుమంజన సేవను నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. సామాన్య భక్తులు సైతం స్వామివారి సేవల్లో పాల్గొనేందుకు సేవా టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచామని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకోవడానికి రాష్ట్రంతోపాటు దేశ, విదేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. వారి కోరిక మేరకు స్వామి సేవల్లో పాల్గొనేలా ఆలయ పాలక మండలి, అధికారులు పలు సేవలను ప్రారంభిస్తున్నారు. ఇందులో భాగంగా సేవా టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచుతున్నారు. అదేవిధంగా టికెట్ల సంఖ్యను పెంచడానికి దేవదాయ ధర్మాదాయ శాఖకు అధికారులు నివేదికలు పంపించారు. ప్రస్తుతం 15 సేవలు నిర్వహిస్తున్నారు. గతంలో 13 సేవలు నిర్వహిస్తుండగా, రెండు నెలల క్రితం మాసంలో లక్షమోదక లక్ష్మీ గణపతి హవనంలో సహస్ర నామార్చన, ఉదయాస్తమాన సేవ ప్రారంభించారు. ప్రస్తుతం ప్రతి బుధవారం తిరుమంజనం సేవను ప్రారంభించారు.


సౌకర్యాల కల్పనకు కృషి



భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తున్నాం. అలాగే వారి కోరిక మేరకు మరిన్ని సేవలు ఏర్పాటు చేయడానికి అందరి సహకారం తీసుకుంటున్నాం. అదనపు గదులు, క్యూలు ఏర్పాటు చేస్తున్నాం.

– మోహన్ రెడ్డి, ఆలయ చైర్మన్

సామాన్య భక్తులకే పెద్దపీట



కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నాం. ముఖ్యంగా శని, ఆది వారాల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. భక్తులకు దగ్గరుండి అన్ని సౌకర్యాలు కల్పించి స్వామివారి దర్శనమయ్యేలా చూస్తున్నాం.

– వెంకటేశు, ఈఓ

మహిళల భద్రతకు పెద్దపీట



సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన జిల్లా కలెక్టర్, ఎస్పీ

చౌడేపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఊహించని రీతిలో భద్రత కోసం ప్రధానంగా మహిళ రక్షణకు పెద్దపీట వేసినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. చౌడేపల్లె–పుంగనూరు మార్గంలోని దొరబావితోట సమీపంలో నూతనంగా రూ.1.60 కోట్ల నిధులతో నిర్మించిన రూరల్ సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ భవనాలను మంత్రి పెద్దిరెడ్డి గురువారం ప్రారంభించారు. పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ దిశ చట్టం మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిందేనని పేర్కొన్నారు. ఈ చట్టం కింద ఆపదలో ఉన్న వారిని క్షణాల్లో పోలీసులు ఆదుకుంటున్నారని తెలిపారు.

శాశ్వత భవనానికి మంత్రి చొరవ

అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఇరుకైన అద్దె భవనంలోని కార్యాలయంలో పోలీసు సిబ్బంది పడుతున్న అవస్థలను మంత్రి పెద్దిరెడ్డి గుర్తించి ప్రత్యేక చొరవ తీసుకుని శాశ్వత భవన ఏర్పాటుకు కృషి చేయడం అభినందనీయమని కొనియాడారు. చిత్తూరు జిల్లాలోనే ఆదర్శంగా సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించారని తెలిపారు. పోలీసులు శాంతిభద్రల పరిరక్షణలో ప్రజలు మెచ్చుకునేలా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు.

శెట్టిగారిపల్లెలో కుంభాభిషేక పూజలు



ఆలయ కుంభాభిషేక పూజలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం శెట్టిగారిపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయ కుంభాభిషేక పూజలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం హోమ పూజలను శాస్త్రోక్తంగా చేశారు.ముఖ్య అతిథిగా చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రిబ్బన్‌కట్ చేసి కుంభాభిషేక పూజలను ప్రారంభించారు. అనంతరం ఆలయ పెద్దలు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు త్యాగరాజులు, రాబర్ట్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సింహవాహన సేవ నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామస్తులు

చిత్తూరు రూరల్: వైశాఖ మాసంలో తేనెబండ ముత్యాలమ్మ దేవస్థానంలో సాంప్రదాయం ప్రకారం సింహవాహన సేవను నిర్వహించాలని గ్రామస్తులు కోరారు. చిత్తూరులోని ముత్యాలమ్మ దేవస్థానం వద్ద గురువారం గ్రామస్తులు సమావేశమై మాట్లాడారు. తేనెబండలో ముత్యాలమ్మ తిరునాళ్ల అనంతరం శుక్రవారం రోజున ముత్యాలమ్మకు సింహ వాహన సేవ నిర్వహించడం తరతరాల సాంప్రదాయమన్నారు. అమ్మవారు సింహవాహనంపై ఆశీనులై ఏడు గ్రామాల్లో విహరించడం ఆనవాయితీ అని, అయితే ఈ ఏడాది ఈ వాహన సేవ నిర్వహించే విషయమై ఆలయ పాలకవర్గం, కార్యనిర్వహణాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇది భక్తుల విశ్వాసాలతో చెలగాటం ఆడటమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి యథావిధిగా వాహన సేవను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో గ్రామస్తులు కుమరేష్, శ్రీనివాస్, మురళి, ఏకాంబరం పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర రహదారికి మరమ్మతులు చేయాలని ఆందోళన



కె.గొల్లపల్లె వద్ద ఆందోళన చేస్తున్న వామపక్షాల నాయకులు, గ్రామస్తులు

యాదమరి: మండలం మీదుగా ఉన్న అంతర్రాష్ట్ర రహదారికి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ గొల్లపల్లె వద్ద రహదారిలో సీపీఎం నాయకులు, గ్రామస్తులు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, చిత్తూరు నుంచి గుడియాత్తంకు ఉన్న ఈ రహదారి మార్గంలో జోడిచింతల నుంచి పరదరామి వరకు పూర్తిగా గుంతల మయమైందని, వాహనాల రాకపోకల కారణంగా దుమ్ము, ధూళి ఇళ్లలోకి వస్తోందని నిరసన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి నివేదించినా పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇకనైనా రోడ్డుకు మరమ్మతులు చేసి, ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు గంగరాజు, సురేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేడుకగా పుష్పయాగం



నాగలాపురంలో స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో పుష్పయాగం గురువారం వేడుకగా నిర్వహించారు. ఉదయం నిత్య కైంకర్యాల అనంతరం అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత వేద నారాయణులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఏడాది కాలంలో సాధారణ సమయాలు, ఉత్సవ వేళల్లో తెలిసో తెలియకో జరిగిన దోష నివారణకు నిర్దేశించిన పుష్పయాగాన్ని మధ్యాహ్నం 3 గంటలకు ఆలయంలోని రాములవారి మండపంలో వేదమంత్రోచ్చరణల నడుమ చేశారు. సర్వభూపాల వాహనంపై ఉభయనాంచారీ సమేత వేద నారాయణులను ఆశీనులు చేసిన అనంతరం టీటీడీ అధికారులు, అర్చకులు సాంప్రదాయబద్ధంగా పుష్పాలను బుట్టలలో ఊరేగించి స్వామి చెంతకు చేర్చారు. అర్చకులు వైఖానస ఆగమశాస్త్రబద్ధంగా ఉత్సవమూర్తులను పుష్పాలతో అభిషేకించి, పుష్పయాగాన్ని పరిపూర్ణం చేశారు. రాత్రి సతులతో కలసి మత్స్యావతారమూర్తి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఏర్పాట్లను టీటీడీ అధికారులు పర్యవేక్షించారు.

చక్రస్నానం..భక్తజన పరవశం



దేవేరులకు తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన గురువారం పద్మ సరస్సులో చక్రత్తాళ్వార్‌తో కలిసి భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. వేకువ జామున 5 గంటలకు సుప్రభాత సేవతో నిత్య పూజా కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు శ్రీవారి పల్లకీ సేవను మాడ వీధుల్లో నిర్వహించారు. అనంతరం శ్రీదేవీ, భూదేవీల సమేతుడైన వెంకటేశ్వరుడు ఊరేగింపుగా పద్మ సరస్సుకు చేరుకున్నారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య అర్చకులు చక్రత్తాళ్వార్‌తో కలిసి దేవేరులకు సుగంధ ద్రవ్యాలు, పాలు, పెరుగు, తేనె తదితర ద్రవ్యాలతో తిరుమంజనం పూర్తి చేశారు. 11.10 గంటలకు పద్మసరస్సులోని జలాలకు సంప్రోక్షణ తదితర కార్యక్రమాలను పూర్తి చేసిన అర్చకులు చక్రత్తాళ్వార్‌ను సరస్సులో మూడు మునకలు వేయించారు. భక్తులు సరస్సులో స్నానమాచరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తులకు ఆస్థానం నిర్వహించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. రాత్రి 7 గంటలకు విశ్వక్సేనుడుతో కలిసి దేవేరులు మాడవీధి ఉత్సవంలో పాల్గొన్నారు. ఆవాహనం చేసిన దిక్పాలకులకు ఉద్వాసన కార్యక్రమాన్ని పూర్తి చేసి గరుడాళ్వార్ చిత్రపటమున్న వస్త్రాన్ని ధ్వజస్తంభం నుంచి అవరోహణం చేయడంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. బ్రహ్మోత్సవాలను నిర్విఘ్నంగా నిర్వహించిన అర్చకులకు ఆలయ మర్యాదలతో గౌరవించారు. కార్యక్రమంలో ఏఈఓ మోహన్, ఆర్జితం అధికారి భరత్, షరాబ్ శ్రీనివాస షనాయ్, రూరల్ సీఐ సురేష్‌కుమార్, ఆలయ భద్రతా జమేదార్ రాజశేఖర్ తదితరులు పర్యవేక్షించారు.



పద్మసరస్సులో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు